సమ్మిట్‌లో దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ

- మొత్తం రూ.5.75 లక్షల కోట్ల హామీలు
- ఫుడ్ ప్రాసెసింగ్, డెటా సెంటర్లకు ఆసక్తి
- ఫార్మా, క్లీన్ ఎనర్జీ రంగాల్లో భారీ ప్రాజెక్టులు
- సిఎం రేవంత్ రెడ్డితో దిగ్గజ కంపెనీల ఒప్పందాలు
- ఇన్‌ఫ్రాకీ డిసి పార్క్స్ రూ.70 వేల కోట్ల పెట్టుబడులు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ కొనసాగింది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో మంగళవారం నాడు వివిధ కంపెనీల ప్రతినిధులు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారు. భారత్ ఫ్యూచర్ సిటీలో రెండో రోజు జరిగిన సమ్మిట్‌లోనూ దిగ్గజ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. మంగళవారం రాత్రి తొమ్మిది గంటల వరకు అందిన సమాచారం ప్రకారం రూ.3.32 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. రోజంతా పెట్టుబడుల జాతర కొనసాగింది. తొలి రోజు రూ.2.43 లక్షల కోట్ల ఒప్పందాలు జరగ్గా.. మొత్తంగా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు హామీలు ఇచ్చినట్లయ్యింది. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగాల పెంపునకు వచ్చిన భారీ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్, డేటా సెంటర్లు, ఔషధ రంగం, క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ వంటి విభాగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులతో పాటు ఉద్యోగాలు వెల్లడించాయి.

ఇన్‌ఫ్రాకీ డాటా సెంటర్ పార్క్స్ 150 ఎకరాల్లో 1 గిగావాట్ సామర్థ్యం గల భారీ డేటా పార్క్ అభివృద్ధి చేపట్టేందుకు రూ.70 వేల కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చింది. జెసికె ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.9 వేల కోట్ల పెట్టుబడులకు హామీ ఇచ్చింది. పెద్ద స్థాయి డేటా సెంటర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపింది.. దీంతో సుమారు రెండు వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది.

ఎజిపి గ్రూప్ మొత్తం రూ.6,750 కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. బయోలాజికల్ ఈ లిమిటెడ్ (బీఈ) టీకాలు, పరిశోధన అండ్ అభివృద్ధి, తయారీ సేవల విస్తరణలో భాగంగా రూ.3,500 కోట్ల కొత్త పెట్టుబడులను ప్రకటించింది. గత పెట్టుబడితో కలిపి మొత్తం రూ.4,000 కోట్లు అవుతుంది. దీంతో మూడు వేలకుపైగా ఉద్యోగాలు రాబోతున్నాయని అంచనా వేసింది.

ఫెర్టిస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ రూ.రెండు వేల కోట్ల పెట్టుబడితో తెలంగాణలో అధునాతన ఆహారం, వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనుంది. దీంతో 800 పైగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయని ఆ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. స్థిర వ్యవసాయానికి అవసరమైన పోషకాలు, బయో ఉత్ప్రేరకాలు తయారీకి రూ.200 కోట్ల పెట్టుబడి ప్రతిపాదించారు. వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ లిమిటెడ్ ఫ్రీజ్ అండ్ డ్రైడ్ కాఫీ ప్లాంట్ స్థాపనకు రూ.1,100 కోట్ల పెట్టుబడితో యూనిట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. దీని ద్వారా వెయ్యి మంది వరకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపింది.

రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ రూ.1,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయబోయే యూనిట్ ద్వారా 1000 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఎలక్ట్రానిక్ తయారీ సేవల విస్తరణలో కేన్స్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ రూ.1,000 కోట్లకు పైగా పెట్టుబడి ప్రతిపాదించింది. ఆర్‌సి సిటీ ఎనర్జీ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ మూడు విడతల్లో రూ.2,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 1,600 కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. పర్వ్యా గ్రూప్ 50 మెగావాట్ల సామర్థ్యం గల గ్లోబల్ కెపాసిటీ, ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా 3 వేల మందికి ఉపాధి వచ్చే అవకాశం ఉంది.

ఫార్మా కంపెనీల ఆసక్తి..

అరబిందో ఫార్మా రూ.2,000 కోట్లతో విస్తరణ చేపట్టి 3వేలకి పైగా ఉద్యోగాలు సృష్టించనున్నట్లు ఆ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. హెటెరో సంస్థ మందుల తయారీ యూనిట్ల విస్తరణకు రూ.1,800 కోట్ల పెట్టుబడి ప్రకటించింది. దీంతో తొమ్మిది వేలకిపైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలకు అవకాశం ఉందని అంచనా వేసింది. గ్రాన్యూల్స్ ఇండియా రూ.1,200 కోట్ల పెట్టుబడితో 2,500-3000 మందికి ఉపాధి కల్పించనుంది. భారత్ బయోటెక్ రూ.1,000 కోట్ల పెట్టుబడితో పరిశోధన, అభివృద్ధి, తయారీ సేవల కోసం ఆధునిక కేంద్రం ఏర్పాటు చేస్తోంది. దీంతో 200లకు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

ఆహార, పానీయాల తయారీ విస్తరణలో కెజెఎస్ ఇండియా రూ.650 కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చింది. ఈ యూనిట్ ద్వారా 1,551 మందికి ఉపాధి దొరకనుందని అంచనా. గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ రాష్ట్రంలో పాల ఉత్పత్తి విస్తరణకు రూ.150 కోట్ల పెట్టుబడితో ఐదు లక్షల లీటర్ల సామర్థ్యం గల యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ యూనిట్ ద్వారా 300 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఆక్వెలాన్ నెక్సస్ లిమిటెడ్ తెలంగాణలో క్లీన్ ఎనర్జీ ఆధారంగా 50 మెగావాట్ల నెట్ జీరో ఉద్గారాల డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది.

పర్యాటక రంగంలో రూ.7,045 కోట్ల పెట్టుబడులు

పర్యాటక రంగంలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించినట్లు అధికారులు వెల్లడించారు. ఫుడ్ లింక్ ఎఫ్అండ్‌బి హోల్డింగ్స్ (ఇండియా) రూ.3,000 కోట్లు పెట్టుబడులతో ముందుకొచ్చింది. డ్రీమ్‌వాలీ గోల్ఫ్ అండ్ రిసార్ట్స్ రూ.1,000 కోట్లతో నిర్మించనున్నారు. సారస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.1,000 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అట్మాస్ఫియర్ కోర్ హోటల్స్ (మాల్దీవులు) రూ.800 కోట్లు, కేఈఐ గ్రూప్ (కామినేని గ్రూప్) రూ.200 కోట్లు, పోలిన్ గ్రూప్ (టర్కీ), మల్టీవర్స్ హోటల్స్ రూ.300 కోట్లు, ఫ్లుడ్రా ఇండియా (స్పెయిన్) రూ.300 కోట్లు, శ్రీహవిషా హాస్పిటాలిటీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.300 కోట్లు, రిధిరా గ్రూప్ రూ.120 కోట్లు, సలామ్ నమస్తే దోసా హట్ (ఆస్ట్రేలియా), విశాఖ రిక్రియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.25 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ యానిమేషన్ ఐఫా ఉత్సవం, ఏథెన్స్ ఈవెంట్ల భాగస్వామ్యం ద్వారా రాష్ట్రానికి రూ.550-600 కోట్ల ఆర్థిక లాభం చేకూరనుంది.

టిడబ్ల్యుఐ గ్రూప్ ప్రపంచంలోనే తొలి ఫ్లగ్ ఇన్ హైబ్రిడ్ మోటార్‌బైక్ తయారీ కేంద్రం తెలంగాణలో ఏర్పాటు. రూ.1,100 కోట్లు పెట్టుబడితో 500 మందికి ఉద్యోగాల కల్పన అవకాశాలు రానున్నాయి. మహీంద్రా అండ్ మహీంద్ర జహీరాబాద్ యూనిట్ విస్తరణకు వచ్చే నాలుగేళ్లలో రూ.500 కోట్లకు పైగా పెట్టుబడికి ముందుకొచ్చింది. ఇండియా ఎక్స్ ట్రీమ్ అడ్వెంచర్ 20 ఎకరాల్లో ఎక్స్ ట్రీమ్ స్పోర్ట్స్, అడ్వెంచర్, ఈ-స్పోర్ట్స్ అరేనా. మొత్తంగా రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టింది.

బయోవరం టిష్యు ఇంజనీరింగ్, రెజెనరేటివ్ మెడిసిన్, సెల్-జీన్ థెరపీకి ప్రత్యేక కేంద్రం రూ.250 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది.

కెనడియన్ ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ తమ తొలి భారతీయ జిసిసిని హైదరాబాద్‌లో స్థాపించనున్నట్లు ప్రకటించింది. జీఎంఆర్ స్పోర్ట్స్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా శాటిలైట్ స్పోర్ట్స్ సిటీ అభివృద్ధి చేయనున్నారు. అజయ్ దేవగన్ ఫిల్మ్ స్టూడియోలో స్టూడియోలు, విఎఫ్ ఎక్స్, వర్క్ షాప్‌లు వంటి ఫిల్మ్ ఎకోసిస్టమ్‌ను పిపిపి మోడల్‌లో అభివృద్ధి చేయనున్నారు. దీంతో యువతకు ఉపాధి అవకావాలు పెరగనున్నాయి. బ్లాక్‌స్టోన్ ఆసియా డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ పార్కులు, కమర్షియల్ స్పేస్‌లలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు.

ప్రపంచ స్థాయి క్రీడా ఈవెంట్లు

ఫీఫా-ఏఐఎఫ్ఎఫ్ ఫుట్‌బాల్ అకాడమీ టాలెంట్ అభివృద్ధికి ప్రపంచ స్థాయి అకాడమీ హైదరాబాద్‌లో స్థాపించనున్నారు. తెలంగాణను గ్లోబల్ హాకి హబ్‌గా మార్చేందుకు హాకీ మహిళల వరల్డ్ కప్ క్వాలిఫైయర్ 2026ను ఎనిమిది దేశాలు పాల్గొనే అంతర్జాతీయ పోటీని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్నారు. 18 దేశాలు పాల్గొనే ఏషియా రోయింగ్ ఛాంపియన్‌షిప్ 2026 నిర్వహించనున్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్ 2026 ప్రపంచంలోనే అతిపెద్ద చెస్ ఉత్సవం కానుంది.

ఆవిష్కరణలే ఆర్థిక వ్యవస్థకు కీలకం

- 3 ట్రిలియన్ డాలర్ల ఎకనామి : భట్టి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ఆర్థిక వ్యవస్థకు పెట్టుబడులు సహా ఆవిష్కరణలు అత్యంత కీలకమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. కృత్రిమ మేధ (ఎఐ), ఆధునిక సాంకేతికత రైతుల ఉత్పత్తులు పెంచేందుకు ఉపయోగపడాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన 'క్యాపిటల్ అండ్ ప్రొడక్టవిటీ' చర్చావేదికలో మంత్రి భట్టి మాట్లాడుతూ.. రాబోయే 22 ఏళ్లలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం లెక్కిస్తే 16 రెట్ల ఆర్థిక వృద్ధిని సాధించాల్సి ఉందని విశ్లేషించారు. "మేము 'తెలంగాణరైజింగ్ 2047'ను ఆవిష్కరించాము. ఇది కేవలం ఒక పత్రం కాదు. ఇది భవిష్యత్తుకు ఇచ్చిన ప్రతిజ్ఞ. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపడం అనే మహత్తర లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాం.'అని భట్టి విక్రమార్క అన్నారు.మనం ఎక్కువగా పనిచేస్తేనే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోలేమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. మరిన్ని రోడ్లు, పెద్ద సంఖ్యలో భవనాలు నిర్మించడం మాత్రమే సరిపోదన్నారు. మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెచ్చినప్పటికీ.. ఈ విప్లవాత్మక వృద్ధిని సాధించాలంటే మన ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక సమీకరణాలు మారాలన్నారు. మూలధనం, ఆవిష్కరణ కలిపితే ఉత్పాదకతగా మారుతుందన్నారు. ఉత్పాదకత ద్వారానే తెలంగాణ సాధారణ పౌరుడి వేతనాలు, గౌరవాన్ని శాశ్వతంగా పెంచే ఏకైక మార్గం అని డిప్యూటీ సిఎం అన్నారు.

PUBLIC NOTICE

The general public are hereby informed that my client Sri.GANESH RAMAN S/o.Kamla Raman, R/o.Villa No.34, Advika Rowville, Near Saraswathi Cricket Ground, Gundla pochampalle, Medchal-Malkajgiri District, Telanagana-500014. has lost the original sale deed document bearing No. 1635/1987, dtd.11-03-1987 registered at SRO-Medchal. On 03-12-2025, in front of the S.B.I, Medchal branch and to that effect he has also lodged a complaint with Police Medchal PS, therefore I request the founder of the said document to return the same to my client, and he would be suitably rewarded.
Date: 05-12-2025

K.JAYAPRAKASH GOUD
Advocate

PUBLIC NOTICE

The general public are hereby informed that my client Sri.AYYAKAD SESHADRI HARIHARAN S/o. A.M.SESHADRI, R/o.H.No.30-253/1/0/2, St.No.1, Near VV.High School, Old Safiguda, Malkajgiri, Medchal-Malkajgiri District, Telanagana-500056 has entered into agreement of sale with Sri.GANESH RAMAN S/o.Kamla Raman, R/o.Villa No.34, Advika Rowville, Near Saraswathi Cricket Ground, Gundla pochampalle, Medchal-Malkajgiri District, Telanagana-500014 for the sale of residential land property Plot No.85 in Sy.no.17 admeasuring 300 Sq.yds situated at Girmapur Village, Medchal Mandal, Telangana. The general public are hereby informed if any individual having any right, title or interest or claim against the said land property should send their claims in writing to the undersigned along with documentary evidence in support of the said claim within 10 days of publication of this notice, failing which claims if any shall deemed to have been waived.
Date: 05-12-2025

K.JAYAPRAKASH GOUD
Advocate

ఆర్థిక రంగానికి 'బూస్టర్ డోస్' పర్యాటకమే

- 2047 నాటికి జిఎస్‌డిపిలో 10 శాతం వాటా
- యువతకు భారీగా ఉపాధి కల్పించడమే లక్ష్యం
- గ్లోబల్ సమ్మిట్‌లో మంత్రి జూపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగం కీలకం కానుందని, 2047 నాటికి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో పర్యాటక రంగం వాటాను పది శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047- గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా "తెలంగాణ అనుభవాలు- వారసత్వం, సంస్కృతి - ఫ్యూచర్ రెడీ టూరిజం" అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు కీలకోపన్యాసం చేశారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని కేవలం సంఖ్యాత్మక సూచికగానే కాకుండా, రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి మార్గంగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి అపారమైన అవకాశాలున్నాయనీ, ఈ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. హాస్పిటాలిటీ, హస్తకళలు, రవాణా రంగాల్లోని వేలాది ఎంఎస్ఎంఈలకు ఇది జీవనాధారమని చెప్పారు. నూతన పర్యాటక విధానంలో ప్రయివేటు పెట్టుబడులను ఆకర్షించడానికి విస్తృత స్థాయి ప్రోత్సాహకాలు ఉన్నాయని తెలిపారు. శాతవాహనుల కాలం నుండి కాకతీయుల శిల్పకళ, కుతుబ్ షాహీ సమాధులు, చారిత్రక కట్టడాల వరకు రాష్ట్ర నిర్మాణ కళా వారసత్వాన్ని మంత్రి కొనియాడారు. కాకతీయ కళా తోరణం వంటి అద్భుతమైన నిర్మాణ సంపదను పర్యాటకులు తప్పక సందర్శించాలని కోరారు. రాష్ట్ర పండుగలు, ఉత్సవాలు, హస్తకళలైన చేనేత, స్థానిక కళాకారుల పనితనం చిన్న వ్యాపారాలకు, సాంప్రదాయ జీవనోపాధికి మూలస్తంభాలని నొక్కి చెప్పారు. పోతన కవితల్లో ప్రతిబింబించే తెలంగాణ ప్రజల దయ, నిజాయితీ వంటి ఉన్నత విలువలను ప్రపంచానికి చాటి చెప్పాలని సూచించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో సులభంగా ప్రాంతీయ పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించడం, తద్వారా సాంస్కృతిక అవగాహన, సామాజిక సుసంపన్నత లభిస్తున్నాయని చెప్పారు. పర్యాటకులకు అన్ని రకాల వసతులను, సుదీర్ఘ ప్రయాణాలకు అనుకూలమైన రోడ్డు సౌకర్యాల కల్పనపై దృష్టి సారిస్తామని మంత్రి జూపల్లి తెలిపారు. పర్యాటక వెబ్‌సైట్ ద్వారా రవాణా, వసతి, భద్రత, ఆకర్షణల గురించి సమగ్ర సమాచారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు, పెట్టుబడిదారులు, పరిశ్రమ నిపుణులు అందరూ కలిసి తెలంగాణ పర్యాటక సంపదను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు పాల్గొన్నారు.

ఒయుకు రూ.2 వేల కోట్లు కేటాయించండి

- అధ్యాపక, బోధనేతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయండి
- విద్యార్థులకు ఉచిత మెస్ సౌకర్యం కల్పించండి
- సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఒయు)లోని సమస్యల పరిష్కారం కోసం రూ.రెండు వేల కోట్లు వెంటనే కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. ఓయూ సమస్యల పరిష్కారం కోసం గతంలో సీఎం ఇచ్చిన హామీ ప్రకారం నిధులను విడుదల చేయాలని కోరారు. వందేండ్ల చరిత్ర కలిగిన ఓయూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిర్వీర్యానికి గురైందని తెలిపారు. గతంలో రేవంత్‌రెడ్డి ఓయూ పర్యటనకు వచ్చిన సందర్భంగా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానంటూ హామి ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఓయూకి వెళ్తున్నందున ఆయనకు అభినందనలు తెలిపారు. వేలాది మంది తెలంగాణ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే విధంగా అన్ని రంగాల్లో ఆధునీకరణ కోసం రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఓయూలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

విశ్వవిద్యాలయంలోని సమస్యల పరిష్కారం కోసం రూ.రెండు వేల కోట్లు వెంటనే కేటాయించాలి, వర్సిటీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఉచిత మెస్ సౌకర్యంతోపాటు, పీజీ విద్యార్థులకు రూ.8 వేలు, పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులకు రూ.25 వేలు ఫెలోషిప్ ఇవ్వాలి, గత పాలకులు వర్సిటీ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా నిబంధనలను ప్రయోగించారు. వర్సిటీ అనేది భావ సంఘర్షణ కేంద్రం. వాటి స్వయం ప్రతిపత్తిని పరిరక్షించే విధంగా ప్రభుత్వం జోక్యం లేకుండా ఉండాలి. క్యాంపస్ నుంచి పోలీస్ స్టేషన్‌ను ఎత్తేయాలి, హాస్టళ్ల భవనాలను ఆధునీకరించి, మౌలిక సదుపాయాలను కల్పించాలి. అవసరమైన కొత్త భవనాలను నిర్మించాలి, కబ్జాలకు గురైన యూనివర్సిటీ భూమిని తిరిగి పరిరక్షించి, వర్సిటీ చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాలి, విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ చేసి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే విధంగా ఒక సెంటర్‌ను ఏర్పాటు చేయాలి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలి, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త కోర్సులను కూడా ఏర్పాటు చేయాలి,రీసెర్చ్ ఓరియంటేషన్‌లలో అన్ని లైబ్రరీలనూ ఆధునీకరించాలి, విద్యార్థి సంఘాలకు ఎన్నికలను వెంటనే నిర్వహించాలి, అన్ని సౌకర్యాలతో ఆస్పత్రిని ఆధునీకరించాలి.

సోనియా, మన్మోహన్ స్ఫూర్తితో సంక్షేమ పథకాల అమలు

- సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్చువల్‌గా తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న సిఎం, పక్కన మంత్రులు

హామీకి కట్టుబడి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ జన్మదినంతో పాటు ప్రతి ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాన్ని జరుపుతామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వివిధ జిల్లాల కలెక్టరేట్లలోని తెలంగాణ తల్లి విగ్రహాలను గ్లోబల్ సమ్మిట్ వేదిక నుంచి వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించిన డిసెంబర్ 9న తెలంగాణ ప్రజలకు సంతోషాన్ని, ఆత్మగౌరవాన్ని నిలెబట్టిన రోజని తెలిపారు. అందుకే ఆ రోజున తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించినట్టు చెప్పారు. గతేడాది సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించామని గుర్తుచేశారు. 2004లో కరీంనగర్‌లో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని తెలిపారు. 4 కోట్ల ప్రజల ఆకాంక్షను యుపీఏ గుర్తించిందన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ఎన్ని అడ్డంకులు, ఆటంకాలు ఎదురైనా వెనుకడుగు వేయలేదని తెలిపారు. ఆమె జన్మదినాన్ని జరుపుకోవడం అందరికి సంతోషాన్నిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ప్రతి కుటుంబానికి సొంతిల్లు ప్రభుత్వ సంకల్పం

- గృహ నిర్మాణంపై సమగ్ర విధానం రూపకల్పన
- ఒఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యలో అఫర్డబుల్ హౌజింగ్ : పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఉన్నతమైన ప్రమాణాలతో నివసించేందుకు అనువైన సొంత ఇంటి వసతిని కల్పించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజలకు అనువుగా ఉండే ధరల్లో ఉండేట్టుగా ఒక సమగ్ర విధాన రూపకల్పనకు తెలంగాణా రైజింగ్ 2047 - గ్లోబల్ సమ్మిట్ చక్కటి వేదిక అని ఆయన పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా మంగళవారం 'అఫర్డ్ బుల్ హౌసింగ్ పాలసీ ఫర్ అర్బన్ ఫ్యూచర్ - తెలంగాణా మోడల్ 2047' అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి కీలక ఉపన్యాసం చేశారు.

పెరుగుతున్నపట్టణీకరణతో పాటు, విస్తృతమవుతున్న గృహ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశానికి ఆదర్శంగా ఉండేలా ఆర్థికంగా సాధ్యమైన, పర్యావరణ అనుకూల సాంకేతికత ఆధారిత అంశాలు ఉండేలా సమగ్రమైన పాలసీని రూపొందిస్తున్నామని మంత్రి పొంగులేటి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించనున్న విధానాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రోల్ మోడల్‌గా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో ఇందిరమ్మ పథకం ద్వారా దాదాపు 42 లక్షల ఇండ్లను నిర్మించగా, ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో సుమారు 3.5 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని మంత్రి తెలిపారు. అంతే కాకుండా మధ్య తరగతి కుటుంబాల కోసం హౌసింగ్ బోర్డ్, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ తదితర సంస్థల ద్వారా సుమారు ఒక లక్ష ఇళ్లు నిర్మించనున్నట్లు ఆయన వివరించారు. గృహాల డిమాండ్- సరఫరా మధ్య భారీ అంతరం పూడ్చడానికి, వ్యక్తిగత పథకాలకు పరిమితం కాకుండా ఆదాయంతో సంబంధం లేకుండా ఒక సమగ్రగృహనిర్మాణవిధానాన్ని రూపొందిస్తున్నామని ప్రకటించారు.

పట్టణ ప్రాంతాల అవసరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, సమతుల్యతతో కూడిన "గృహ నిర్మాణ తెలంగాణ నమూనా 2047" వైపు చారిత్రక అడుగు వేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో ఒఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యలో పేద, మధ్య తరగతి ప్రజల కోసం కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డ్ తరహాలో ఇండ్లను నిర్మించాలని ఆలోచిస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాలుగా విభజించి కోర్ అర్బన్ ప్రాంతంలో మురికివాడల పునరాభివృద్ధి, ఐటీ కారిడార్లలో అందుబాటులో అద్దె గృహ నిర్మాణం, రవాణా కారిడార్ల వెంబడి గృహాల ఏర్పాటు, పరి-అర్బన్ ప్రాంతం ప్లాన్డ్ టౌన్‌షిప్‌లు, భారత్ సిటీ వంటి గ్రీన్‌ఫీల్డ్ శాటిలైట్ టౌన్‌లు, పారిశ్రామిక ప్రాంతాలలో కార్మికుల గృహ వసతి, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో చిన్న/మధ్య తరహా టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌లతో అనుసంధానించబడిన అద్దె/కార్మికుల గృహ నిర్మాణం ప్రధాన వ్యూహాలుగా తయారు చేసినట్టు మంత్రి పొంగులేటి వివరించారు.

అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమగ్రమైన అఫర్డబుల్ హౌజింగ్ పాలసీ ఆవశ్యకత చాలా ఉన్నదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొత్తగా రూపొందించనున్న అఫర్డబుల్ హౌజింగ్ పాలసీలో ఇటీవల ప్రకటంచిన క్యూర్, ప్యూర్, రేర్ జోన్లకు అనుగుణంగా అనుసరించాల్సిన విధానాలను నిర్దేశించనున్నామని వెల్లడించారు. ఈ సెమినార్‌లో ప్రపంచ బ్యాంకు ప్రతినిధి అభిజిత్ శంకర్ రే, రాంకీ సిఎండి నంద కిషోర్, హడ్కో ఎండి వి సురేష్ , క్రెడాయ్ ప్రెసిడెంట్ జి. రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థలో పర్యాటకం కీలకం

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ లక్ష్య సాధనలో టూరిజం శాఖ పాత్ర కీలకమని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ రైజింగ్ - గ్లోబల్ సమ్మిట్‌లో "ఎక్స్‌పీరియన్స్ తెలంగాణ: హెరిటేజ్, కల్చర్ - ఫ్యూచర్-రెడీ టూరిజం" అనే అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో మంత్రి కొండా సురేఖతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభ్యున్నతి కోసం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మన చారిత్రక వారసత్వం గురించి తెలంగాణ పౌరులంతా తెలుసుకోవాలని సూచించారు. ఎకో టూరిజం నూతనాధ్యాయంగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర విస్తీర్ణంలో 19 శాతం అడవులు ఉండడం, తెలంగాణ ప్రకతిరమణీయంగా ఉండటం మంచి వరమని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మానవ వనరులు తక్కువగా ఉన్న అనేక దేశాలు పర్యాటక రంగాన్ని ప్రధాన ఇంజిన్‌గా చేసుకుని అద్భుతమైన ఆర్థిక ప్రగతిని సాధించాయని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణలోని ఈ రంగానికి అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రంలోని యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించవచ్చన్నారు. ఇప్పటికే హాస్పిటాలిటీ, హస్తకళలు, రవాణ రంగానికి టూరిజం ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. ప్రజలు, పెట్టుబడిదారులు, పరిశ్రమ నిపుణులు అందరూ కలిసి తెలంగాణ పర్యాటక సంపదకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఇలాంటి నేలపై ఉన్న దేవాలయాలు కూడా మరింత అభివృద్ధికి నోచుకోవాలని తెలిపారు. అందుకోసం టూరిజం డిపార్ట్‌మెంట్‌తో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య 36కు పెరగడం సంతోషకరమన్నారు. దేవాలయాలను పునరుద్ధరించడంతో పాటుగా వాటి పరిరక్షిస్తామన్నారు. జీవ వైవిధ్య, ప్రజల సంస్కృతిని పరిరక్షించడమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామోజీ ఫిల్మ్‌సిటీ వైస్ ప్రెసిడెంట్ ఎవి రావు, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిటిడిసి) మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, సిసిఎఫ్ ప్రిన్సిపల్ సునీతా భగవత్, నీతమ్ డైరెక్టర్ వెంకట రమణ, ఎక్స్‌పీరియం ఛైర్మన్ రాందేవ్ రావు, ఐహెచ్‌సిఎల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

IN THE HON`BLE COURT OF THE II ADDL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
IP.23/2025

Between :
Koduru Kasi Naidu ... petitioner
And :
Yallapu Appala Rajasekhar & others ...Respondents

NOTICE FOR PUBLICATION

To Respondents : -
R-5, Dollu Vimala wife of murali Hindu, aged about 42 years business at shiva teja Castings S.no.686A. Dundgal Kazipally Road, madchal malkajgiri district, Hyderabad -500043.
R-6 : miriyala naga raju, son of Devadanami Hindu, aged about 34 years, business at shiva teja casting S.no.686A, Dundgal Kazipally Road madchal, malkajgiri District, Hyderabad -500043.
R-7 : Ravada Krishna Rao son of chinna babu, Hindu aged about 50 years, Residing at koundenya apartments A.Block fitth floor, opposite indian oil petrol bunk Godavari Homes. sumitra circle Quthubullapur Road, Medchal District, Hyderabad - 500067
R-8 : Rayela Ravi Shankar, son of rama Koteswararao, Hindu, Aged about 50 years residing at koundenya apartments A Block, fitth floor, opposite indian oil petrol bunk Godavari Homes. sumitra circle Quthubullapur Road, Medchal District, Hyderabad - 500067
R-9 : Uttaravelli satish son of Gowru Naidu, Hindu aged about 50 years, Residing at Quthbullapur, Opposite old shivalayam, H.No. 4-18/1 madchal district, Hyderabad -500055
R-10 : Goudappala Mallesh son of Narasimharao Hindu aged about 33 years, Residing at Quthbullapur, sunitha nilayam D.no 6-624, near venugopa lakshmi temple, Bobbili, Doctor side madchal District- 500055, Hyderabad
R-11: Vavilapalli santosh kumar son of suryanarayana, Hindu, aged about 35 years, Quthbullapur, patigadda D.No.6-612. madchel District 500055, Hyderabad
R-12: Allada Malleswara Rao Son of Apparao Hindu, aged about 35 years business at mounika cell point vangara Village and madal, Vizianagarama District
R-13: Bejjipuram Rama Krishna son to apparao Hindu age about 39 years, kamaskhi Residency, RR intras, Quthbullapur, RuQmini Estate, Plot No. 6-587/2068214/69, New pochamma Temple, madchal District, Hyderabad
R-14 : Kalinga Venkata Ramana son of Raminaidu Hindu, Aged about 48 years, residing at M. Nagabhusanarao & Annapurna Nivas, H.No.6-95/6, Prasant Nagar, Sri Venugopal swami High opposite, Quthubullapur, madchal District, Hyderabad -500055

NOTICE

Please take notice by way of publication that petitioner has filed The above I.P. against You and other Respondents to declare him as in solveny person under section 7 and 10 of provisional, Insolvency Act and The Matter stands Posted To **26-12-2025** for your appearance you on hereby reguared to appear before the Hon`ble Court either in person or through duly instructed advocate on **26-12-2025 at 10:30 Am** in II nd Addl Senior Civil judge court at Visakhapatnam i.e in the above court, failing which the matter will be heand and detormined in your absence
(by the order of the Honble Court)
K.GANAPATHI,
Advocate, Visakhapatnam.

విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

- ఉస్మానియా వేదికగా సిఎం స్పష్టంగా ప్రకటించాలి
- రాష్ట్రవ్యాప్త కార్యాచరణకు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహించాలని, ఆ దిశగా సిఎం రేవంత్ రెడ్డి ఈనెల 10న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే సభలో తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ప్రకటన చేసి విధి విధానాలు ప్రకటించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు - ఆవశ్యకత" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజనీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పృథ్వి, ఎఐడిఎస్ఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు నీతీష్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎ.సాంబ, జార్జిరెడ్డి పిడిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగేశ్వర్ రావు, పిడిఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పవన్, తెలంగాణ యువజన సంఘం శశంకార్ మాట్లాడారు.

గతంలో జరిగిన హింసాత్మక ఘటనలతో గత కొన్ని దశాబ్దాలుగా విద్యార్థి సంఘాల ఎన్నికలను రాష్ట్రంలో నిషేధించారని వారు తెలిపారు. దీంతో రాజకీయాల్లోకి

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

విద్యావంతుల రాక తగ్గిపోతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. హింస నెపంతో విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహణను నిరాకరిస్తున్న వారే... సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా సార్వత్రిక ఎన్నికలను ఎలా నిర్వహిస్తున్నారని వారు ప్రశ్నించారు. యూనివర్సిటీల్లో ఎన్నికల నిర్వహణతో విద్యార్థుల చదువులకు ఇబ్బందులు కలుగుతాయన్న వాదననూ వారు కొట్టిపారేశారు. జెఎన్‌యూ, హెచ్‌సియులలో ఎన్నికలు జరగటం లేదా? ఆ యూనివర్సిటీల్లో విద్యార్థులు చదువుల్లో రాణించడం లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ విద్యా కమిషన్ తన సిఫార్సుల్లో యూనివర్సిటీలలో ఎన్నికలు నిర్వహించాలని తెలిపిందనీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తానే గతంలో ఉస్మానియా యూనివర్శిటీలో జరిగిన సభలో విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలనీ, అప్పుడే రాజకీయ వ్యవస్థలో అభివృద్ధి ,ప్రజాసేవ చేసే రాజకీయలు ఉంటాయని ప్రకటించారని గుర్తు చేశారు.

విద్యార్థి సంఘాలకు ఎన్నికలు ఉంటే విద్యా సంస్థలలో ఫీజుల పెంపు, మౌలిక సదుపాయాలు , హాస్టల్స్ సదుపాయాలు, విద్యార్థినీల సమస్యలు, సైద్ధాంతిక అంశాలపై చర్చ జరిగి సమస్యలు పరిష్కారం అవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక అభివద్ధికి ఆటంకంగా ఉన్న డ్రగ్స్, సోషల్ మీడియా లాంటి అంశాలపై చర్చలు కులం, మతం, దేశ అభివృద్ధి రాజ్యాంగ పరిరక్షణ లాంటి చర్చలు నిరంతరం జరుగుతాయని, విద్యార్థులు రాజకీయాల్లో రాణిస్తారని తెలిపారు. సామాజికంగా వెనుకబడిన తెలంగాణ రాష్ట్రానికి దేశ ప్రజాస్వామ్యానికి విద్యార్థి సంఘం ఎన్నికలు కీలకమని వారు అభిప్రాయపడ్డారు. ఎన్నికలు నిర్వహించు కుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామనీ, దాని కోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య పోరాట కార్యచరణ రూపొందిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, విఎస్‌కె నాయకులు తెలంగాణ శ్యాం పాల్గొని విద్యార్థి సంఘాల డిమాండ్‌కు మద్ధతు తెలిపారు. వెంటనే రాష్ట్ర యూనివర్సిటీల్లో ఎన్నికలకు ప్రభుత్వం పూనుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి కిరణ్, కె అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా, జె రమేష్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేందర్, శ్రీమాన్, స్టాలిన్, జార్జిరెడ్డి పిడిఎస్‌యు హైదరాబాద్ కార్యదర్శి అంజి, ఎఐడిఎస్ఒ హైదరాబాద్ నాయకులు నాగరాజు, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా నాయకులు కైలేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థులకు
నేడు గ్లోబల్ సమ్మిట్ సందర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థులు బుధవారం గ్లోబల్ సమ్మిట్‌ను సందర్శించనున్నారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించడానికి ప్రత్యేకంగా ఎంపిక చేసిన కొన్ని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే అనుమతిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఆయా పాఠశాలలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఎంపిక చేస్తారనీ, కేవలం ఎంపిక చేసిన ఈ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే రేపు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు అనుమతిస్తున్నట్టు ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

జనరల్ స్థానాల్లో బిసి అభ్యర్థులను గెలిపించండి

- జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో నిలబడిన బిసిలను గెలిపించాలని బిసి జెఎసి చైర్మెన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బిసిలను మోసం చేసిన రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 9 ద్వారా బిసిలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్లు అమలు చేస్తే 5,380 సర్పంచ్ స్థానాలు దక్కేవనీ, అలా కాకుండా జీవో నెంబర్ 46 ద్వారా అమలు చేయడంతో 3,400 బిసి రిజర్వు స్థానాలను జనరల్ స్థానాలుగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫ్యూచర్‌సిటీలో స్టూడియో ఏర్పాటుకు సహకారం

- సినీప్రముఖులతో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ఫ్యూచర్ సిటీలో స్టూడియోలను ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో భాగంగా సినీ ప్రముఖులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. 24 క్రాఫ్ట్‌లో సినిమా ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా స్థానికులకు శిక్షణ ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని సినీ వర్గాలకు సిఎం సూచించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, నిర్మాతలు అల్లు అరవింద్, సురేష్ బాబు, దిల్ రాజు, నటులు జెనీలియా, అక్కినేని అమల, తెలుగు, హిందీ ప్రముఖులు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపునివ్వాలి

- ఈ నెల 11న ఢిల్లీలో టిఆర్‌టిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు నివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద టిఆర్‌టిఎఫ్ ధర్నా నిర్వహించనుంది. ఈ మేరకు మంగళవారం టిఆర్‌టిఎఫ్ అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక చట్టం అమల్లోకి వచ్చిన నాటి నుంచి చట్ట నిబంధనలు వర్తింపజేయడం సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా ఉంటుందని వారు తెలిపారు. టెట్ విషయంలో ఈ విధానాన్ని పాటించకపోవడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రస్తుత పార్లమెంట్ సెషన్స్‌లోనే చట్ట సవరణ చేసి ఇన్‌సర్వీస్ టీచర్లకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

సిఎం ప్రజావాణిపై హరీశ్‌రావువి నిరాధార ఆరోపణలు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌ఛార్జి చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం ప్రజావాణి ప్రజా సమస్యల పరిష్కారంలో దాదాపు 70 శాతం సక్సెస్ రేటు ఉందనీ, మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని సీఎం ప్రజావాణి ఇన్‌ఛార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా హరీశ్‌రావు తప్పుడు సమాచారంతో శుద్ధ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. కరీంనగర్‌కు చెందిన గొడుగు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు పరిష్కారం కాలేదని హరీశ్‌రావు విమర్శించారనీ, అసలు ఆ వ్యక్తి ఎవరో తమ రికార్డుల్లో లేదని స్పష్టం చేశారు. కనీసం కన్నెత్తి చూసే పరిస్థితి కూడా లేని ప్రగతి భవన్ ఇనుప కంచెలను బద్దలు కొట్టి ప్రజా భవన్‌గా మార్చి, సిఎం ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా సమస్యలు చెప్పుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పించారని పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తరపున తాను, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ రెగ్యులర్‌గా ప్రజావాణి నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

గోల్డ్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడుల పేరుతో టోకరా

- ఓ వ్యక్తి నుంచి రూ.24.44 లక్షలు స్వాహా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోల్డ్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలొస్తాయని నమ్మించిన సైబర్ నేరస్థులు సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.24,44,152ను దండుకున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లో నివసిస్తున్న ఓ వ్యక్తికి గతేడాది డిసెంబర్ 13న గుర్తు తెలియని నెంబర్ నుంచి వాట్సప్ సందేశాలు వచ్చాయి. వాటిని చూసిన బాధితునికి ఓ అమ్మాయి తాను 'శరణ్య'గా పరిచయం చేసుకుంది.

అప్పటి నుంచి ఇద్దరు స్నేహితులుగా మాట్లాడుకుంటున్నారు. ఎంతో నమ్మకంగా ఉన్నట్టు నమ్మించిన సైబర్ నేరస్థురాలు బాధితుడితో గోల్డ్ అనే యాప్ ద్వారా ట్రేడింగ్ చేయాలని చెప్పింది. తాను సూచించిన యాప్ ద్వారా పెట్టుబడులు పెడితే దాదాపు 70 శాతం లాభాలొస్తాయని నమ్మించింది. దాంతో బాధితుడు లక్షల్లో పెట్టుబడులు పెట్టాడు. మొదట్లో కొంత డబ్బులు తీసుకునేందుకు అనుమతించారు. ఆ తర్వాత రూ.24,44,152 వరకు పెట్టుబడులు పెట్టగా బాధితున్ని నమ్మించేందుకు రూ.39లక్షలు లాభాలొచ్చాయని స్క్రీన్‌పై చూపించారు.

వాటిని తీసుకునేందుకు ప్రయత్నించడంతో సైబర్ నేరస్థులు అనుమతులు నిరాకరించారు. డబ్బులు విత్‌డ్రా చేయాలంటే మరికొంత డబ్బులను ఇన్వెస్ట్ చేయాలని సూచించడంతోపాటు పన్నులు చెల్లించాలని షరతులు పెట్టారు. దాంతో అనుమానించిన బాధితుడు మోసపోయినట్టు గుర్తించి సిసిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, ఆర్థిక లావాదేవీల విషయాలు ఎవరితోనూ పంచుకోవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు.

కార్మికవర్గంలో రాజకీయ చైతన్యాన్ని కల్పించాలి

- ఫిబ్రవరిలో ప్రత్యక్ష ఆందోళనలు
- విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరు
- సిఐటియు రాష్ట్ర మహాసభలో జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుల, మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తూ ప్రజల దృష్టిని మరల్చుతున్న ప్రస్తుత తరుణంలో కార్మికవర్గం మరింత అప్రమత్తంగా ఉండాలని సిఐటియు అఖిల భారత కోశాధికారి ఎమ్.సాయిబాబు సూచించారు. వారిని రాజకీయంగా చైతన్యపరచాల్సిన బాధ్యత సిఐటియుపై ఉందని ఆయన నొక్కి చెప్పారు. మోడీ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరిలో ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టబోతున్నామని వెల్లడించారు. కేంద్రం తెచ్చిన విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కూలీలను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

మెదక్ పట్టణంలో మూడు రోజులపాటు కొనసాగిన సిఐటియు ఐదో రాష్ట్ర మహాసభ మంగళవారం స్ఫూర్తిదాయకంగా ముగిసింది. ఈ సందర్భంగా ప్రతినిధులనుద్దేశించి సాయిబాబు ప్రసంగిస్తూ... కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలను బలహీనపర్చి పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని దుయ్యబట్టారు. అందులో భాగంగానే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు దూకుడుగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి విధానాలను ప్రతిఘటించేందుకు క్షేత్ర స్థాయిలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో మోడీ నేతృత్వంలోని 'కార్పొరేట్ మతోన్మాద ప్రభుత్వం' రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామిక విలువలను ఉల్లంఘిస్తూ 'శ్రమశక్తి నీతి -2025' పేరుతో కొత్త కార్మిక విధానాన్ని తీసుకు రాబోతున్నదని హెచ్చరించారు. దీనికి మనువాదం ప్రేరణని చెప్పటం అత్యంత దారుణమని అన్నారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వ సూత్రాలకు తిలోదకాలిస్తూ రాజధర్మం, మనుధర్మం పేరుతో కుల, మత విభజనలతో కార్మిక వర్గ పోరాటాలను బలహీన పర్చేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి కుట్రలు పన్నుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

వీటికి వ్యతిరేకంగా ప్రతిఘటనా పోరాటాలను ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు వేతనాల గ్యారంటీ, సామాజిక భద్రత, మహిళా కార్మికులకు సాధికారత, వ్యక్తిపరమైన ఆరోగ్య భద్రతకు ఎలాంటి గ్యారెంటీ ఉండబోదని హెచ్చరించారు. యూనియన్లు పెట్టుకునే హక్కు, సమిష్టి బేరసారాల హక్కు, సమ్మె చేసే హక్కులపై తీవ్ర దాడి జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను తమ రాష్ట్రంలో అమలు చేయబోమంటూ కేరళ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. అదే తరహాలో తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మికులను సమరశీల పోరాటాల వైపునకు నడిపించేందుకు వీలుగా ఈనెల 31 నుంచి జనవరి నాలుగు వరకు విశాఖపట్నంలో నిర్వహించబోయే సిఐటియు అఖిల భారత మహాసభల్లో కార్యాచరణ రూపొందించబోతున్నట్టు సాయిబాబు తెలిపారు.

సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన చుక్క రాములు, పాలడుగు భాస్కర్

సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చుక్క రాములు, పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చుక్క రాములు, పాలడుగు భాస్కర్, కోశాధికారిగా వంగూరు రాములు తిరిగి ఎన్నికయ్యారు. మెదక్ పట్టణంలో మూడు రోజులపాటు కొనసాగిన సిఐటియు ఐదో రాష్ట్ర మహాసభల్లో చివరి రోజైన మంగళవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఎస్వీ రమ తిరిగి ఎన్నికయ్యారు. ఆఫీసు బేరర్లుగా 31 మందిని ఎన్నుకోగా... అందులో ఉపాధ్యక్షులుగా ఎస్ వీరయ్య, ఆర్ సుధాభాస్కర్, భూపాల్, ఎస్వీ రమ, కళ్యాణం వెంకటేశ్వరరావు, టి వీరారెడ్డి, పి జయలక్ష్మి, జె మల్లిఖార్జున్, వీఎస్ రావు, కె ఈశ్వరరావు, టి రాజారెడ్డి, ఆర్ త్రివేణి, కార్యదర్శులుగా జె వెంకటేశ్, ఎ ముత్యంరావు, బి మధు, జె చంద్రశేఖర్, బి మల్లేశ్, ఎం పద్మశ్రీ, కూరపాటి రమేష్, పి శ్రీకాంత్, ఎం వెంకటేశ్, ఎజే రమేష్, రాగుల రమేష్, కె గోపాల స్వామి, కాసు మాధవి, పి సుధాకర్, జి కవితతోపాటు ఒక కో-ఆప్షన్ సభ్యుణ్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 139 మందితో రాష్ట్ర కౌన్సిల్‌ను, 103 వర్కింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభ ప్రతినిధులకు మూడు రోజుల పాటు అన్ని సౌకర్యాలు కల్పించిన ఆహ్వాన సంఘానికి మహాసభ ధన్యవాదాలు తెలిపింది.

ఏక రాగం దశ సినీ గీతాల సంపుటి విశేషం

ప్రజాశక్తి - కల్చరల్

సినీ గీతాలలో రాగాల తెలుసు కోవాలసిన విశేషాలు ఎన్నో ఏక రాగం దశ సినీ గీతాలు సంపుటిలో ఉన్నాయని ప్రముఖ గాయని ఎస్‌పి శైలజ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంశీ ఇంటర్నేషనల్ శ్రీ కృష్ణ స్వర రాగ ప్రవంతి నిర్వాహణలో రూపాకుల మహేశ్వరీ రచించిన ఏక రాగం దశ సినీ గీతాలు సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా శైలజ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. మంచి పుస్తకం ఉత్తమ నేస్తం ఆత్మ విశ్వాసం ఇస్తుందన్నారు. విషయ పరిజ్ఞానం కోసం మంచి పుస్తకాలు చదవాలన్నారు. అటువంటి పుస్తకం ఏక రాగం దశ సినీ గీతాలు అని ప్రతి గ్రంథాలయంలో సంగీత శిక్షణ ఇచ్చే విద్యాలయాలులో ఉండాలని సూచించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతంలో సప్త స్వరాలు ఉన్నాయని, వాటిని అన్వయిస్తూ సినీ గీతాలలో రాగ విశ్లేషణ నాగేశ్వరీ తన సంపుటిలో చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రచురణ కర్త వల్లభిజ్యుల గాయని అమాంతలను సత్కరించారు. వంశీ రామరాజు కార్యక్రమాన్ని నిర్వహించగా సినీ సంగీత దర్శకుడు సురేష్ రాష్ట్రపతి నిలయం ఎస్టేట్ మేనేజర్ రజనీ ప్రియ, గాయని సురేఖ, సంఖ్య శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ పాల్గొన్నారు. వైఎస్ రామ కృష్ణ లలిత బృందం సుంకర పల్లి శైల నిర్వహణలో పలు సినిమాల్లో పాటలు ఆలపించారు.

గిరిజన హక్కుల కోసం విఎన్‌వికె శాస్త్రి కృషి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- శాస్త్రి భౌతికకాయానికి నివాళి అర్పించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గిరిజన హక్కులు, సంస్కృతి, సమస్యలపై జీవితమంతా అంకితభావంతో పనిచేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ వీఎన్‌వీకే శాస్త్రి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కొనియాడారు. మంగళవారం హైదరాబాద్‌లోని మెహిదీపట్నంలో శాస్త్రి భౌతికకాయానికి జాన్‌వెస్లీ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మృతికి సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏటూరు నాగారం, ఉట్నూర్, శ్రీశైలం, భద్రాచలం ఐటీడీఏలలో ప్రాజెక్టు అధికారిగా, ఆ తరువాత గిరిజన సాంస్కృతిక అధ్యయన సంస్థ డైరెక్టర్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించారని గుర్తుచేశారు. గిరిజన సంస్కృతి, సంక్షేమం, జీవనోపాధి, భౌగోళిక హక్కులపై అనేక పరిశోధనలు చేసి పుస్తకాలు, వ్యాసాలు రాసి ప్రజలను చైతన్యపర్చారని తెలిపారు. గిరిజన హక్కులు, చట్టాల రక్షణ కోసం అండగా ఉంటూ, సదస్సులు, సెమినార్‌లలో ప్రత్యక్షంగా పాల్గొని వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేవారన్నారు.

బాక్సైట్ తవ్వకాల్లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీలో సభ్యుడిగా గిరిజనులకు వాటిల్లే నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తెస్తూ, నివేదికను సమర్పించారని గుర్తుచేశారు. ఇంద్రవెల్లి గిరిజన భూముల ఆక్రమణ సందర్భంగా జరిగిన పోలీస్ కాల్పుల్లో 25 మంది మరణించిన ఘటనపై విచారణాధికారిగా పనిచేసి పోలీసులపైనే వ్యతిరేకంగా ధైర్యంగా నివేదికిచ్చిన అరుదైన అధికారి అని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన అనేక గిరిజన కమిటీల్లో సభుడిగా పనిచేసి గిరిజనుల విద్య, వైద్యం, ఉపాధి, భూముల హక్కుల పరిరక్షణకు చివరి వరకూ శ్రమించిన ఆయన సేవలు అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, అధ్యక్షులు ఎం ధర్మానాయక్, రైతు సంఘం ఉపాధ్యక్షులు మూడ్ శోభన్ పాల్గొని నివాళు లర్పించారు.

భవిష్యత్తులో పోలీస్ శాఖలో డ్రోన్ల పాత్ర కీలకం

- సమ్మక్క, సారక్క జాతరలో వినియోగిస్తాం
- గ్లోబల్ సమ్మిట్‌లో డిజిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం డ్రోన్లను వినియోగించనున్నామని రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరుగుతున్న మీర్‌ఖాన్‌పేట్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు డ్రోన్ల ఉపయోగాలపై ఆయన ఆసక్తిగా పరిశీలన చేశారు. గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో సైతం 10 డ్రోన్లతో ట్రాఫిక్ నియంత్రణ, పరిసరాలపై నిఘాను పర్యవేక్షించడం జరిగిందని అధికారులు డీజీపీకి వివరించారు. వాటి పనితనాన్ని పరిశీలించిన డిజిపి ఇకముందు రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల దర్యాప్తు, ట్రాఫిక్ నియంత్రణ విషయంలో డ్రోన్లను విరివిగా వినియోగించడానికి అవసరమైన అవకాశాలను అన్నింటినీ పరిశీలిస్తామని తెలిపారు. రాబోయే సమ్మక్క, సారక్క భారీ జాతరలో విచ్చేసే లక్షలాది మంది భక్తులను నియంత్రించే విషయంలోనూ, పరిసరాలపై నిఘా వేయడానికి డ్రోన్లను వినియోగిస్తామని ఆయన తెలిపారు. అలాగే నేరాలు జరిగినప్పుడు దర్యాప్తు అధికారులు ఆ ప్రాంతానికి చేరుకునేలోగా అక్కడి పరిస్థితులను, వాతావరణాన్ని వెంటనే అధికారులకు తెలియజేసేలా డ్రోన్లను వినియోగిస్తామని ఆయన తెలిపారు. మొత్తానికి పోలీస్ శాఖ విధుల్లో డ్రోన్ల ఉపయోగం భవిష్యత్తులో మరింత కీలకం కానున్నాయని శివధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కాగా పోలీస్ శాఖ స్టాల్ ను పరిశీలించాక ఆయన అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్ ను సందర్శించారు. బందోబస్తును సీసీ కెమెరాల ద్వారా ఆయన పరిశీలించారు. మొత్తం ఆరు వేల మంది పోలీసులతో ఏర్పాటు చేసిన బందోబస్తు వివరాలను అధికారుల నుంచి డీజీపీ తెలుసుకున్నారు. కాగా, ఇటీవలనే రిక్రూట్ అయిన 115 మంది ప్రొబేషనరీ డీఎస్పీలను బందోబస్తులో వినియోగిస్తున్న తీరును కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విదేశీ ప్రతినిధులకు లైజన్ అధికారులుగా 30 మంది ప్రొబేషనరీ డీఎస్పీలను నియమించడాన్ని ఆయన అభినందించారు. అలాగే ఈ బందోబస్తులో ముగ్గురు అదనపు డీజీలు, 10 మంది ఐజీలు, 10 మంది ఎస్పి స్థాయి ఐపిఎస్ అధికారులను పర్యవేక్షణ అధికారులుగా నియమించడం జరిగిందని ఈ సందర్భంగా డిజిపి తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ప్రశాంతంగా ముగియడానికి పోలీస్ అధికారులు మొదలుకొని సిబ్బంది వరకు నిర్విరామంగా చేసిన కృషిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన వెంట శాంతి భద్రతల విభాగం అదనపు డిజి మహేశ్ భగవత్, రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు తదితర అధికారులు ఉన్నారు.

చెన్నుపాటి ఆశయాలు కొనసాగించడమే ఉద్యమ లక్ష్యం కావాలి

- వర్ధంతి సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి ఉపాధ్యాయుల కోసం సంఘం పెట్టుకునే స్వేచ్ఛను సాధించి ఎలిమెంటరి టీచర్స్ ఫెడరేషన్‌ను స్థాపించిన ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడుగా చరిత్రలో నిలిచిన నేత చెన్నుపాటి లక్ష్మయ్య అని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే యూటీఎఫ్ కార్యకర్తల లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్ మాట్లాడారు. బ్రిటీష్ నియంతృత్వాన్ని ఎదురించి ఉపాధ్యాయ ఉద్యమం కోసం పోరాడిన నేతగానే కాకుండా సామాజిక స్పృహతో ప్రజల కష్టాల పట్ల కూడ చెన్నుపాటి పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు నేడు పొందుతన్న పెన్షన్, ఇంక్రిమెంట్లు, నెలనెలా జీతాలు తదితర అనేక సౌకర్యాలను పోరాటాల ద్వారా సాధించిన ఉద్యమ నేత చెన్నుపాటి అని తెలిపారు. నేటి పాలకులు అవలంభిస్తున్న విధానాలు కూడా బ్రిటీష్ పాలనను పోలి ఉన్నాయనీ, అందుకే చెన్నుపాటి చూపిన బాటలో పోరాటం చేయాలని సూచించారు. ప్రభుత్వ తిరోగమన విధానాలను తిప్పి కొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు యస్‌టీఎఫ్ఐ పూర్వ ఉపాధ్యక్షులు యం.సంయుక్త మాట్లాడుతూ మానవ సంబంధాలు నిలుపడంలో, విద్యా ప్రయివేటీకరణను వ్యతిరేకించడంలో ప్రజలతో ఉపాధ్యాయులు సత్సంబంధాలు కలిగి ఉండడం లాంటి లక్షణాలు చెన్నుపాటి నుంచి నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో పత్రిక ప్రధాన సంపాదకులు పి మాణిక్‌రెడ్డి, ప్రచురణల కమిటీ కన్వీనర్ ఎస్వై కొండల్‌రావు, సీనియర్ నాయకులు డి మస్తాన్‌రావు, ఇంద్రజిత్, ఎన్ రమేష్, నరసింహారెడ్డి, యం.వెంకటేశ్వర్లు, టాప్రా ఉపాధ్యక్షులు అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

తనకు ఇప్పుడే పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదని.. ఇంకా చదువుకుంటానని చెప్పినా తల్లిదండ్రులు పెండ్లి సంబంధాలు చూస్తుండటంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలం కొట్టాల గ్రామానికి చెందిన బొర్ర శృతి (20) నల్లగొండ పట్టణంలోని రవీంద్రనగర్ బిసి గర్ల్స్ హాస్టల్‌లో ఉంటూ ఎన్జీ కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతుండేది. ఆమెకు పెండ్లి చేయాలని తల్లిదండ్రులు సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. అయితే, తనకు ఇప్పుడే పెండ్లి వద్దని.. ఇంకా చదువుకోవాలని ఉందని ఆమె తల్లితో చెప్పింది. తల్లిదండ్రులు మాత్రం వివాహం చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో శృతి మనస్తాపానికి గురై మంగళవారం హాస్టల్ బాత్రూమ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఎంతసేపైనా బయటకు రాకపోవడంతో తోటి విద్యార్థినులు పిలిచారు. అయినా స్పందన లేకపోవడంతో బాత్రూం డోర్‌ను పగులగొట్టి.. ఉరేసుకున్న శృతిని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థిని చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుని అదృశ్యం విషాదాంతం

- ట్రాక్టర్ కిందపడి మృతి
- భయంతో మృతదేహాన్ని డంపింగ్ యార్ట్‌లో పడేసిన డ్రైవర్ అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలం ధర్మారావుపేటలో అదృశ్యమైన ఐదేళ్ల బాలుని ఘటన విషాదాంతమైంది. ఆదివారం సాయంత్రం అదృశ్యమైన బందెల రాకేశ్(5) ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. భయంతో మృతదేహాన్ని మట్టి డంపింగ్ ప్రదేశంలో దాచిన ట్రాక్టర్ డ్రైవర్ గంపల శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. మంగళవారం ఎస్ఐ అశోక్ కథనం ప్రకారం... ధర్మారావుపేటకు చెందిన బందెల రాజు, రజిత దంపతుల చిన్న కుమారుడు రాకేశ్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా, వరి కోత పనులకు బయలుదేరిన గంపల శంకర్ అతన్ని మరో బాలుడితో పాటు ట్రాక్టర్‌పై ఎక్కించుకున్నాడు. ట్రాక్టర్ కదులుతుండగా రాకేశ్ ప్రమాదవశాత్తు కిందపడి చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగిందన్న భయంతో శంకర్.. బాలుని మృతదేహాన్ని గన్నీ సంచిలో చుట్టి సమీపంలోని ఒసి -3 గని మట్టి డంపింగ్ యార్డ్‌లో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రాకేశ్ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, గ్రామస్తులు శంకర్‌ను ప్రశ్నించగా అతని మాటల్లో పొంతనలేని సమాధానం రావడంతో వెంటనే రాకేశ్ తల్లిదండ్రులు గణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ అశోక్, డ్రైవర్ శంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతడు జరిగిన ప్రమాదాన్ని ఒప్పుకున్నాడు. శంకర్ చూపించిన ప్రదేశానికి సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు వెళ్లి.. జెసిబిలతో మట్టిని తవ్వించి బాలుని మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పంచనామా చేసి పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.